
# పూర్వజన్మ సుకృతం

సి.లలిత




"బాబుకు ఒంట్లో బాలేదండీ! రెండు రోజుల్నుంచి జలుబుగా ఉంటోంది. ఒకసారి డాక్టరు దగ్గరకు తీసుకువెడితే మంచిదేమో!" అంది వనజ కంగారుగా ఆఫీసుకు తయారవుతున్న భర్తతో.

"బాబుకు జలుబుగా ఉంటే నాకు చెప్పడ మెందుకు? మన వీధి చివరిలో డాక్టరు మంజరి నర్సింగ్ హెూమ్ ఉంది. దగ్గరే కదా! ఒకసారి తీసుకువెళ్లి ఆవిడకు చూపించు. నేను సాయంత్రం వచ్చేసరికి ఆలస్యం అవవచ్చు" అంటూ కంగారుగా వెళ్లిపోయాడు శేఖర్.

డాక్టరు మంజరి నర్సింగ్ హెూమ్‌ను గురించి తనూ వింది. డాక్టరు చాలా మంచిదని, పిల్లల విషయంలో చాలా శ్రద్ధగా, ఓర్పితో చూస్తుందనీను.

త్వరగా పని ముగించుకుని, ఇంటికి తాళం వేసి రెండేళ్ల బాబును తీసుకుని నర్సింగ్ హెూముకు బయలుదేరింది. భర్త చెప్పినట్లు అట్టే దూరంలేదు.

పైన నేమ్ ప్లేటు మీద

'డాక్టర్ సి.మంజరి ఎం.బి.బి.ఎస్., ఎం.డి చిన్నపిల్లల వైద్యులు' అని ఉంది.

వెయిటింగ్ రూములోకి వెళ్లేసరికి అక్కడ అప్పుడే చాలా మంది ఉన్నారు. తన రాక అక్కడ ఉన్న అటెండరుతో చెప్పి, ఒక పక్క బెంచి మీద పిల్లవాడిని ఒడిలో ఉంచుకుని కూర్చుంది. కొంచెం సేపటికి మెళ్లో స్టెతస్కోపు, పైన ఓవరాల్‌తో ఆకర్షణీయంగా, నాజూకుగా ఉన్న ఒక యువతి, ఒక పెద్దావిడను మర్యాదగా సాగనంపుతూ హాలులోకి వచ్చింది. పెద్దావిడ వెళ్లిన తర్వాత హాలులో కూర్చుని ఉన్న అందరి వైపూ చూస్తూ చిరునవ్వుతో పలకరించి లోపలికి వెళ్లిపోయింది.

వనజకు ఆ యువతిని చూడగానే ఆవిడే డాక్టరు మంజరి అని అర్థమైంది. 'ఇంత చిన్న వయస్సులో ఈవిడ స్పెషలిస్టా' అని ఆశ్చర్యపోయింది. ఆ అందమైన ముఖాన్ని ఎక్కడో చూసినట్లు అనిపించింది వనజకు. పేరు సి.మంజరి. నాతో పది సంవత్సరాల క్రితం ఇంటర్‌మీడియట్ చదివిన మంజరీ, ఈ డాక్టరు మంజరీ ఒకటి కాదు గదా? మొహంలో పోలికలు కొట్టవచ్చినట్లు కనిపిస్తున్నాయి. అయినా పోలికలు ఉన్నంత మాత్రాన ఈవిడ నా క్లాస్‌మేటు

మంజరి ఎలాగ అవుతుంది? ఈవిడ ఎం.డి. చేసి చైల్డ్ స్పెషలిస్టు అయింది. అదేమో ఇంటరులోనే చదువు మానేసి పెళ్లి చేసుకోవాలని ఉబలాట పడేది అటువంటి ఆ మంజరి, ఈ డాక్టరు మంజరి ఒకటే అనడానికి ఆస్కారం లేదు" అని మనస్సును సమాధానపరుచుకోడానికి ప్రయత్నించింది. కాని డాక్టరు ముఖంలో ఉన్న చురుకుదనం, ఎదుటి వారిని ఆకర్షించే అందం చూడగానే తన చిన్ననాటి స్నేహితురాలేననే నమ్మకాన్ని తోసివేయలేకపోయింది. ఈ విధంగా ఆలోచిస్తుంటే, తన చిన్ననాటి మంజరితో స్నేహం, తను గడిపిన రోజులు ఒక్కొక్కటే జ్ఞాపకానికి వచ్చాయి. అందులో తమిద్దరి మధ్య ఒకనాడు కాలేజీలో జరిగిన సంభాషణ తన స్మృతిపథంలో మెరిసింది.

*** *** ***

"మన కొత్త కెమిస్ట్రీ లెక్చరరు పాఠాలు బాగా చెప్తున్నారు గదే! కెమిస్ట్రీ క్లాసులు చాలా ఆసక్తికరంగా ఉంటున్నాయి" అంది మంజరి, తన క్లాసుమేట్ వనజతో.

"ఓహో! మొన్నటివరకు కెమిస్ట్రీ అంటేనే తలనొప్పి అని, ఆ సబ్జెక్టు వట్టి బోర్ అనేదానివి; ఇంతలో నీకు కెమిస్ట్రీ అంటే ఇనత ఆసక్తి కలిగిందా? ఆశ్చర్యంగా ఉందే. ఇంతకీ నీకు ఆ పాఠాలు ఇంటరెస్టింగ్‌గా ఉన్నాయా, లేక ఆ లెక్చరరే ఇంటరెస్టింగ్‌గా ఉన్నారా?" అంది వనజ.

"పోవే, ఎప్పుడూ నీకు అన్నీ అనుమానాలు, ఆశ్చర్యాలే! హఠాత్తుగా సబ్జెక్టులో ఆసక్తి కలుగకూడదా ఏమిటి?. అవును. నువ్వన్నట్లు లెక్చరరు కూడా చాలా అందంగా ఉన్నాడు కదే! క్లాసులో కూర్చుని అతని పాఠాలు వినకపోయినా, అతన్ని చూస్తూ కూర్చుంటే ఇట్టే టైము గడిచిపోతోంది గదే. మంచి స్టైలిష్ లెక్చరరు" అంది మంజరి.

"నీ మొహం! నువ్వు చదివేది ఇంటరు. నిన్ను మీ వాళ్లు బాగా చదువుకుని బాగుపడతావని కాలేజీకి పంపిస్తున్నారుగాని, లెక్చరర్ల అందాన్నివల్లె వేయడానికి కాదు!"

"అది సరే లేవే! నువ్వు చూశావా? ఈ కొత్త లెక్చరరు సిగరెట్టు ఎంత నాజూగ్గా కాలుస్తాడే, రియల్లీ వండర్‌ఫుల్ స్టైల్!"

"అతను సిగరెట్టు కాల్చడం ఎప్పుడు చూశావు? అయితే అతన్ని క్లాసులోనే గాక పైన కూడా చూస్తున్నావన్నమాట" అంది వనజ.

"స్టాఫ్ రూము మన వెయిటింగ్ రూము క్రిందనే కదే! మన రూములోకి వస్తూ అనేకసార్లు చూశాను. అది సరేకాని, నే నొకటి చెప్పనా మనం ఈ చదువంతా చదివి ఏం ఉద్ధరించాలి చెప్పు? ఎప్పుడో ఒకప్పుడు పెళ్లి చేసుకోవలసిందే కదా! ఏదో ఒక చెత్త డిగ్రీ చేతికి వస్తే, పెళ్లి అయిన తర్వాత వచ్చే మొగుడు 'నీకి డిగ్రీ ఉంది కదా. ఉద్యోగం ఎందుకు చెయ్యకూడదు? ఏదో ఇద్దరం కలిసి సంపాదిస్తే డబ్బూ కలిసి వస్తుంది. నీకూ కాలక్షేపమూ ఉంటుంది" అంటూ మనల్ని ఉద్యోగంలోకి తోస్తే, ఉద్యోగంలో చాకిరి, ఇంటి చాకిరితో మన జీవితం ఒక గాడిద జీవితంలా తయారవుతుంది. అంచేత...."

"అవును. నిన్ను కట్టుకున్న మహానుభావుడు నిన్ను ఉద్యోగంలోకి తోస్తాడని ఎలాగ అనుకుంటున్నావు? ఈ రోజుల్లో మగ వారికి ఎక్కడ లేని అనుమానాలు, భార్య వీధిలోకి వెడితే అనుమానంతోను, అసూయతోను బాధపడే వాళ్లే చాలా మంది. పెళ్లాం నాలుగు గోడల మధ్య ఇంట్లో ఉండటమే వాళ్లకు కావలసింది. ఒక వేళ అంత ఉదార పురుషుడే నీకు భర్తగా లభిస్తే నువ్వే ఉద్యోగం చెయ్యనని చెప్తే ఎవరూ నిన్ను బలవంతపెట్టలేరు" అంది వనజ.

"నీ అయితేగియితేలు కట్టిపెట్టి నేను చెప్తున్నది విను. నా ఉద్దేశ్యంలో ఉద్యోగం మాట వదిలేసినా, ప్రస్తుతం మనం పడుతున్న కష్టం ఎందుకు అంటాను నేను. బెంజీన్ రింగులో ఎన్ని డబుల్ బాండులు ఉన్నాయో బోర్డింకను డిసెక్టు చేస్తే ఏం కనబడుతుందో, ఇవన్నీ మనకు జీవితంలో ఏమాత్రం ఉపయోగించకపోగా, ప్రస్తుతం మాత్రం మనలో ఉన్న శక్తినంతటినీ తోడిపారేస్తున్నాయి. ఈ పాఠాలన్ని చదవలేక నా పని అవుతోందనుకో. నన్నడిగితే ఎంత త్వరగా పెళ్లి చేసుకుంటే అంత మంచిదంటాను. శుభ్రంగా ముస్తాబై, మొగుడితో స్కూటరు మీద షికారు వెడుతూ సినిమాలు చూస్తూ ఉంటే అందే సుఖం, సంతృప్తి ఈ చదువులతో ఎప్పటికి రావు! నాకు ఇలాగ జీవితం నిరర్థకం చెయ్యాలని లేదు. త్వరగా పెళ్లి చేసుకుని సుఖపడాలని ఉంది" అంది మంజరి.

"అయితే మీ అమ్మ నాన్నలతో చెప్పు. పెళ్లికి ఏర్పాటు చేస్తారు" అంది వనజ.

"చెప్పి ఉందునే. కాని నాకు లైను క్లియర్ అవలేదు కదే! మా అక్క ఉంది చూశావా, మా నాన్న ఎన్ని సంబంధాలు తెచ్చినా ఒక్కదానికీ ఒప్పుకోడంలేదు. మొన్నటికి మొన్న ఒక మంచి సంబంధం వచ్చింది. అబ్బాయి ఒక పెద్ద కంపెనీలో ఆఫీసరుగా ఉంటున్నాడుట. ఎంత బాగున్నాడనుకున్నావ్! నేనే కనుక అతని ఎదురుగా కూర్చుని ఉంటే తక్షణం ఒప్పేసుకుని ఉందును. కాని మా అక్క చూశావ్. పరి మొద్దావతారం! వాళ్లు కట్నం అడిగారుట - నాన్నా! కట్నం ఇస్తే మాత్రం నేను ఈ పెళ్లి చేసుకునేది లేదు' అని చెప్పింది. అయినా నాకు తెలియ కడుగుతానూ, మా నాన్న కట్నం ఇవ్వడానికి సిద్ధంగా ఉంటే దీని కెందుకే ఆ గొడవ? అది పెళ్లి చేసుకోదు. నన్ను చేసుకోనివ్వదు. చూశావ్, ఇది నా పూర్వజన్మసుకృతం!"

"పోనీ, నేను వెళ్లి మీ నాన్న గారితో చెప్పనా? మీ మంజరికి త్వరగా పెళ్లి చేసుకోవాలని ఉంది. అది ఒక అబ్బాయిని ఇష్టపడుతోంది. అంచేత దాని పెళ్లి కుదిర్చే ఏర్పాటు చెయ్యండి అని" అంది వనజ.

"చంపావు పో. ఆ మాట విన్నారంటే మా నాన్న నన్ను బతకనివ్వరు. అయినా నా సంగతి నీ కెందుకు. నీ గొడవ నువ్వు ఏడుద్దూ. మహా పెద్ద చదువులు చదివి ఏం ఒరగబెడ్తావో నేనూ చూస్తానుగా" అంది మంజరి.

*** *** ***

బాబు ఒడిలో నిద్రలో ఉంటే తన మనస్సు పది సంవత్సరాలు వెనక్కుపోయి చిన్ననాటి జ్ఞాపకాలను వల్లె వేస్తూ ఉండగా అటెండరు తన నంబరు పిలవడంతో ఈ లోకంలోకి వచ్చింది వనజ. కంగారుగా బాబును భుజం మీద వేసుకుని డాక్టరు గదిలోకి వెళ్లింది. డాక్టరుకు నమస్కారం చేసి ఆవిడ చూపిన స్టూలు మీద బాబుతో కూర్చుంది.

"ఏవమ్మా! ఏమయింది బాబుకు? కొద్దిగా ఒళ్లు వేడిగా ఉందే. ఎప్పటి నుంచి?" అని డాక్టరు అడిగిన ప్రశ్నకు వెంటనే సమాధాన మివ్వక ఆవిడనే తదేకంగా చూస్తూ "ఈవిడ మాట కూడా తన స్నేహితురాలు మంజరి మాట లాగే ఉంది. ఈవిడ అదే అయుంటుంది అడిగేస్తేనో?' అని ఆలోచిస్తోంది వనజ.


తను అడిగిన ప్రశ్నలకు సమాధానం రాకపోయేసరికి "ఏమిటమ్మా ఆలోచిస్తున్నావు? చూడమ్మా! పైన ఇంకా చాలా మంది ఉన్నారు గదా! చెప్పండి, బాబుకు జ్వరం ఎప్పటి నుండి ఉంది?" అంది డాక్టరు.

ఆ మాటకు వనజ కంగారుపడి "క్షమించండి, డాక్టరు గారూ! బాబుకి రెండు రోజుల నుండి జలుబుగా ఉంది. ఈ రోజు కొంచెం వెంపరేచరు కూడా వచ్చింది. ఏమీ తినడంలేదు. పాలు కూడా తాగడంలేదు. భయంగా ఉందండి" అంది వనజ.

"ఏం వర్రీలేదమ్మా! ఇది మామూలు జ్వరమే! మందు రాస్తున్నాను. దీన్ని అరు గంటల కొకసారి బాబుకి పట్టండి. రే పీ పాటికి తగ్గిపోతుంది. రెండు రోజుల తర్వాత ఒకసారి

---

**బాలీవుడ్ బాణీ**



## రవీనాయణం

రవీనా టాండన్‌తో అక్షయ్‌కుమార్ తెగతెంపులు చేసుకున్నాడని చెబుతున్న వారు కాస్త నిదానించి మాట్లాడాలి. అక్షయ్ ఇంటిలో ఏదో పూజా కార్యక్రమం సందర్భంగా వారిద్దరికీ నిశ్చితార్థం జరిగిందని వినికిడి. దుర్గా భక్తుడైన అక్షయ్ మాట తప్పడని కొందరి నమ్మకం.

పైగా ఈ మధ్య రవీనా ఊళ్లో లేనప్పుడు ఆవిడకి ఇష్టమైన ఎర్ర స్పోర్ట్స్ కారులో అక్షయ్ షికార్లు కొట్టాడు. ఇప్పుడేమంటారు మరి?

- మసూద్ అన్సారి

వచ్చి చూపించండి."

"చాలా థాంక్సండి. డాక్టరు గారూ! మీరేమీ అనుకోనంటే మిమ్మల్ని ఒక విషయం అడగాలని ఉంది."

"దానికేం అడగండి."

"మీరు గుంటూరులో ఎప్పుడైన ఉన్నారా? అక్కడ కాలేజీలోగాని చదివారా?"

"ఆ! గుంటూరులో పది సంవత్సరాల క్రితం మా నాన్న గారు ఉద్యోగంలో ఉండేవారు. నేను అక్కడ ఇంటర్ మీడియట్ చదివాను. ఏం, ఎందుకు?"

"మీకు ఇంటరులో ఒక స్నేహితురా లుండేది. వనజ అని. మీ రిద్దరు చాలా క్లోజ్‌గా ఉండేవారు. అది మీకు జ్ఞాపకం ఉందా?"

"వనజా! అది జ్ఞాపకం లేకపోవడమేమిటి? ఎప్పుడూ చదువు మీదే దాని ధ్యాస. ఎప్పుడైనా సినిమాకి రమ్మన్నా ఏదో టైమంతా వృధా అయిపోతున్నట్లు బాధపడుతూ ఉండేది. ఐ.ఏ.ఎస్. పాస్ అయి కలెక్టరు అవాలనే పట్టుదలతో ఉండేది. మార్కులు కూడా బాగానే వచ్చేవి. దాని మార్కులు, దాని చదువు చూస్తే దాని మీద నాకు ఒక విధంగా అసూయ కూడా ఉండేది. మా నాన్న గారికి బదిలీ అవడంతో గుంటూరు వదిలి వచ్చేయడం వల్ల దానిని మళ్లీ కలవడం కుదరలేదు. వనజ మీకు తెలుసునా? ఇప్పుడది ఎక్కడ ఉంది?" అంది డాక్టరు మంజరి.

"ఆ వనజను నేనే అంటే మీరు, అదే, నువ్వు నమ్మగలవా మంజరీ?" అంది వనజ.

"ఏవిటీ? నువ్వు వనజవా? ఎంత కాలానికి మళ్లీ కలుసుకున్నాం! నాకు చాలా ఆనందంగా ఉందే! ఏమే! నువ్వు చాలా మారిపోయావే. కొంచెం ఒళ్లు చేశావు. నిన్ను ఆనవాలు పట్టలేకపోయానే. ఐ యామ్ సారీ. మనం తీరిగ్గా మాట్లాడుకోవలసినవి చాలా ఉన్నాయి. ఈ పేషెంట్లు వెళ్లనీ. బాబుని పక్క గదిలో పడుకోబెట్టు. త్వరగా పని ముగించుకుని వస్తాను" అంది మంజరి.

పేషెంట్లు అందరు వెళ్లగానే ఎవరినీ లోపలకు పంపవద్దని నర్సుకు చెప్పి మంజరి వనజతో "ఇప్పుడు చెప్పు. మనం కలిసి ఇంచుమించు పది సంవత్సరాలయింది కదే. మీ వారు ఏం చేస్తున్నారు? బాబు ఒక్కడేనా సంతానం? ఎంతకాలమైంది నీకు పెళ్లయి? నువ్వు ఉద్యోగం చేస్తున్నావా?" అంటూ ప్రశ్నల వర్షం కురిపించింది మంజరి.

వనజ మెల్లిగా నవ్వుతూ "అన్నీ ఒకసారే అడిగితే ఎట్లాగే? నాకు కూడా మాట్లాడడానికి టైమియ్యవే! మా ఆయన ఇక్కడ స్టీలు ప్లాంటులో ఇంజనీరు. నాకు ఇద్దరు పిల్లలు. పాపకు అయిదేళ్లు. ఒకటో తరగతి చదువుతోంది. ఆ తర్వాత ఈ బాబు. మేము వైజాగ్ వచ్చి నాలుగేళ్లయింది. నా సంగతికేం గాని, నీ సంగతి చెప్పు. మనం ఇంటరు చదువుతున్న రోజుల్లో, నువ్వు పెళ్లి చేసుకుని సుఖంగా ఉండక ఈ చదువు లెందుకు అనే దానివి. ఇంత పెద్ద చదువు చదివి స్పెషలిస్టు ఎలాగ అయావే? నిన్ను చూడగానే ఆనవాలు పట్టగలిగాను. కాని, నీ అప్పటి మాటలు జ్ఞాపకం వచ్చి నువ్వు ఆ మంజరివి అయి ఉండవని అనుమానం వచ్చింది. ఏవిటే, నువ్వు ఆ మంజరివేనా?"

"ఆ! నేను ఆ మంజరినే. అప్పటి ఆ ఆలోచనలు, నీతో మాటలు నాకు పూర్తిగా జ్ఞాపకం ఉన్నాయి. అవన్నీ ఆ వయస్సు అజ్ఞానం. దానికి ఆ వయస్సులో చూసే నగటు సినిమాలు, చదివే చెత్త సాహిత్యం పగటి కలల ఒరవడిలో వీరవిహారం చేయడానికి దోహదం చేస్తాయి. అదొక క్రేజ్. ఆ క్రేజ్‌లో పడి సగటు అమ్మాయిలు తమ జీవితాలను నిరర్థకం చేసుకుంటున్నారు. మన అదృష్టాలు బాగుండి మనం ఆ వలయాలలో చిక్కుకోలేదు. అందుకు మన గృహ వాతావరణం కారణం!"

"ఏమోనే, అప్పటి నీ కబుర్లు వింటూంటే నాకు నిజంగా భయంగా ఉండేదనుకో. ఒక్కోసారి మీ అమ్మగారికి నీ గురించి చెబుదామని అనిపించేది."

"అదేవిటే! నేను కాలేజీ హీరోలను గురించి మాట్లాడుతూ ఉండినా, వచ్చిన తుక్కు సినిమాలన్నీ నువ్వు వచ్చినా, రాకపోయినా




చూస్తూ ఉండినా, చదువులో బాగానే ఉండేదాన్ని కదే! ఆ మాట కొస్తే అప్పుడప్పుడు నీ కన్నా నాకు మంచి మార్కులు వస్తూ ఉండేవి. జ్ఞాపకం ఉందా? మనం ఇంటరు పరీక్షలు రాసిన వెంటనే మా నాన్న గారికి బదిలీ అయి మేము గుంటూరు నుంచి వెళ్లిపోయాము. తర్వాత ఇంటరు రిజల్ట్సు రావడం మనిద్దరం ఫస్టుక్లాసులో పాస్ అవడం నీకు తెలిసిందే! నాన్న గారి ప్రోత్సాహం వల్ల మెడిసిన్ ఎంట్రన్సు పరీక్షకు కూర్చోవడం, సీటు రావడం ఎం.బి.బి.ఎస్. చదవడం, దాని తర్వాత ఎం.డి. - ఇవన్నీ ఒకదాని తర్వాత ఒకటి జరిగిపోయాయనుకో. మా నాన్న రిటైరు అయిన తర్వాత ఇక్కడ సెటిల్ అయారు. మా అన్నయ్య ఎలాగా అమెరికాలో ఉన్నాడు గదా అని, నేను మా నాన్న అమ్మల దగ్గర ఉందామని ఇక్కడే ప్రాక్టీసు పెట్టాను. ఇక్కడ ప్రాక్టీసు పెట్టాను కాబట్టే నిన్ను చూడగలిగాను" అంది మంజరి.

"అవును. మీ అక్క ఏం చేస్తోంది? పెళ్లి చేసుకుందా?" అడిగింది వనజ.

"ఆ! పెళ్లి అయింది. దాని సంగతి నీకు తెలుసుగా. కట్నం ఇస్తే పెళ్లి చేసుకోనని మా నాన్నకి కచ్చితంగా చెప్పేది. కట్నం లేకుండా ఏ మగధీరుడు ముందుకు వస్తాడు పెళ్లి చేసుకోవడానికి? ఇద్దరు ఒకే చదువు చదివి ఉద్యోగాలు చేస్తున్నా అబ్బాయికి కట్నం వస్తే గాని పెళ్లికి అంగీకరించని రోజులు ఇవి. మా అక్కయ్య పట్టుదల మా తల్లిదండ్రులకు పెద్ద సమస్య అయిందనుకో. ప్రతి రోజు దాని పెళ్లి విషయంలో ఇంట్లో పెద్ద రభస అయేది. 'నాకు కట్నం ఇవ్వగల శక్తి ఉంది. నేను చూసిన సంబంధం నీకు నచ్చితే చేసుకో! నచ్చకపోతే మానెయ్యి. అంతేగాని కట్నం గొడవ నీ కెందుకే!' అని నాన్న ఎంత చెప్పినా ససేమిరా అల్లా వీల్లేదంటూ తన పట్టుదల విడవలేదు. ఇక దానికి పెళ్లయ్యే యోగం లేదని మా తల్లిదండ్రులు బాధపడుతూ ఉండేవారు. ఆ సమయంలో ఒక మహానుభావుడు ముందుకు వచ్చి కట్నం లేకుండా అక్కను పెళ్లి చేసుకోడానికి ఒప్పుకున్నాడు. కుర్రవాడు మంచివాడు. కుటుంబం మంచిది. కాని చేసే ఉద్యోగం మాత్రం అంతంతది. అటువంటి చిన్న ఉద్యోగాలు చేసే వారు మాత్రం కట్నం పుచ్చుకోడం లేదా అని సమాధానపడి, అబ్బాయిని గురించి వాకబు చేసి, ఏ చెడు అలవాట్లూ లేవని, బుద్ధిమంతుడని తెలుసుకుని పెళ్లి నిశ్చయించారు.

పెళ్లయిన తర్వాతనే అక్క కష్టాలు మొదలయ్యాయి. మా అక్కను గురించి నీకు తెలుసుగా! ఎప్పుడూ ఏదో బొమ్మలు గీస్తూ ఉండేది. మెల్లిగా ప్రావీణ్యం అలవడి, శ్రద్ధతో తన మనస్సును చిత్రలేఖనం మీద లగ్నం చేస్తూ కృషితో చిన్న ఆర్టిస్టుగా తయారైంది. కాని ఈ ఉత్సాహానికి పెళ్లి అడ్డు తగిలింది. పెళ్లయిన కొత్తలో దాని భర్త - అదే మా బావ గారు దీని వ్యాపకాన్ని చూసీ చూడనట్లు ఊరుకున్నా తర్వాత ఎత్తిపొడవడం మొదలు పెట్టాడు.

"అన్నమానం పిచ్చి పిచ్చి గీతలు గీస్తూ కూర్చోపోతే ఏదైనా ఉద్యోగంలో చేరకూడదూ? నా ఒక్కడి సంపాదన ఇద్దరి భారాన్ని మోయలేదు. ఇదివరలో నే నొక్కడినే కాబట్టి రాజాలా బ్రతికేవాడిని. ఇప్పుడు ఈ రాణీ గారిని కూడా పోషించాలి కదా! దీనికి మీ నాన్న నాకు ఏమీ ఆస్తి ధారాదత్తం చేయలేదు. నేను నా సరదాలు ఎన్ని తగ్గించుకున్నా నేను సంపాదించింది మన కిద్దరికి సరిపోవటం లేదు. అంచేత నువ్వు కూడా ఉద్యోగంలో చేరితే బాగుంటుంది" అంటూ రోజూ సాధిస్తూ ఉండేవాడు.

"నేను చదివిన బి.ఏ.కి ఏం మంచి ఉద్యోగం వస్తుందండీ? అయినా నాకు ఉద్యోగం చేయాలని లేదు. నా ప్రస్తుత హాబీలో నాకు సంతృప్తి ఉంది. ఆ మాత్రం డబ్బు దీనివల్ల సంపాదించలేకపోను. నన్ను బలవంతంగా ఉద్యోగంలోకి గెంటకండి" అని మా అక్క ఎంత ప్రాధేయపడినా అతను వినిపించుకోలేదు.

"ఇక్కడ నే నొక్కటి చెప్పనా? మా బావ గారు మామూలు మనిషి. మనకంటే ఎదుటి వారిలో ఏదైనా ప్రత్యేకత ఉంటే దాన్ని పొగడడం మాట అటు ఉంచి, కించపరచడం, హేళన చేయడం

మనలో సర్వసాధారణం. ఎదుటి వారు మన దగ్గర వారైతే ఇది మరీ ఎక్కువగా ఉంటుంది. అదే తన భార్య అయితే ఇక మగవాడికి పట్టపగ్గాలే ఉండవు. ఇది అజ్ఞానమను, అసూయ అను, ఉక్రోషం అను. ఏదైనా తను చేయలేని పని, అందులో కాస్త గుర్తింపు గలిగేది తన భార్య చేస్తోంది అంటే నగటు మగవాడి మనస్సంక్షోభం ఒక విధంగా అతన్ని రగిల్చేస్తూ ఉంటుంది. దానికి ఉపశమనం తన భార్య చేసే పనికి అడ్డంకులు కలిగిస్తేనే కలుగుతుంది. అదే మా బావ గారు చేసిన పని. బలవంతంగా దాన్ని చిన్న ఉద్యోగంలో చేర్పించగలిగాడు. దాని ఉద్యోగం వల్ల కుటుంబానికి ఏమీ పెద్ద లాభం కలుగకపోయినా అతను మాత్రం ఏదో ఘనకార్యం సాధించిన వాడిలా ఫీల్ అయ్యాడు. ఉద్యోగంలో చేరిన తర్వాత మా అక్క ఏదో పోగొట్టుకున్న దానిలా తయారైంది. బొమ్మలు గీయడం మీద ఆసక్తి మాట ఏమైనా, అసలు టైమనేదే దొరకక పూర్తిగా మానేసింది. ఏదో అలా యాంత్రికంగా రోజులు వెళ్ళదీస్తోంది.

"దీనికంతటికీ కారణం ఎవరంటావ్? అదే. మా నాన్న మాట విని ఆయన హోదాకు తగిన కట్నమిచ్చి తెచ్చిన సంబంధం చేసుకుని ఉంటే దానికి ఈ కష్టాలు ఉండకపోవును. పెద్ద ఉద్యోగం చేస్తున్న వాడికి తన భార్యను చిన్న ఉద్యోగంలో చేర్పించాలని ఉండదు. అది అతనికి చిన్నతనంగా ఉంటుంది. అంచేత మా అక్క ఇంట్లో కూర్చుని తన చిత్రలేఖన వ్యాసంగంలో ఆనందంగా కాలం గడిపే అవకాశం ఉండేది. దాని కర్మ అలాగ ఉంటే ఎవరేం చేస్తారు? కట్నమిస్తే పెళ్లి చేసుకోనని భీష్మించుకు కూర్చుంది. పూర్వజన్మ సుకృతం అంటారు చూడు. అది మా అక్క విషయంలో నిజమయింది.

"అది సరే, వనజా! మనం చదువుకుంటున్న రోజుల్లో నువ్వు బాగా పెద్ద చదువు చదివి, పెద్ద ఉద్యోగం చెయ్యాలి అనే పట్టుదలతో బాగా మార్కులు తెచ్చుకుంటూ, కష్టపడి చదువుతూ ఉండేదానివి గదా! ఇదేమిటే, ఇంత త్వరగా పెళ్లి చేసుకుని చదువుకు స్వస్తి చెప్పావు!" అంది మంజరి.

"మీ అక్క విషయంలో పూర్వజన్మ ఫలమో, సుకృతమో అన్నావు చూశావా? నేను నా విషయంలో అంత మాట అనను గాని, జీవితంలో మనం అనుకున్నవన్నీ జరిగితే చిత్రమేముందే? నాలాటి స్త్రీలు లోకంలో చాలా మంది ఉంటారు. ఎక్కడో ఏ కొద్ది మందికో తప్ప అమ్మాయిలకి చిన్నతనం నుండి అబ్బాయిలతో సమానంగా చదవాలని, పోటీ చేయాలని, తమ తెలివితేటలతో పైకి వచ్చి మగవారితో సమానంగా, అంతకంటె ఎక్కువ హోదాలో ఉద్యోగాలు చెయ్యాలని ఉంటుంది. కాని ఆ అదృష్టం ఏ కొద్ది మందికో, నీలాటి వారికి మాత్రం కలుగుతుంది. దీనికి ప్రస్తుతం మన సమాజంలోని సంకుచిత భావాలే కారణం.

"మనలాటి కుటుంబాలలో తల్లిదండ్రులు పిల్లల చదువు విషయంలో ఆడ, మగ భేదాలు చూపక సమాన అవకాశం కలిగిస్తున్నప్పటికీ, కొంత పరిధి దాటిన తర్వాత మాత్రం ఆడపిల్లలు ముందుకు వెళ్లడానికి తల్లిదండ్రులు ప్రోత్సాహం చూపడంలేదు. చదువు ఎక్కువైన కొద్దీ సంబంధాలు దొరకడం కష్టం అవుతుందని భయం. అబ్బాయిలు తమ చదువుకు సమానమైన చదువు గల అమ్మాయిలను పెళ్లికి అంగీకరించవచ్చునేమో గాని, తమ కంటె ఎక్కువ చదివిన అమ్మాయిలను వివాహం చేసుకోడానికి అంగీకరించరు. ఈ భయం వల్లనే తల్లిదండ్రులు కూతుళ్ల చదువును పొడిగించడానికి ఇష్టపడడంలేదు. పైగా ఎంత చదువు చెప్పించినా అమ్మాయికి తగిన కట్నం ఇవ్వకపోతే వివాహం అవడం కష్టం. మధ్యతరగతి కుటుంబీకులు చదువుకు ఖర్చు పెట్టి, పైన కట్నం ఇచ్చే స్తోమత లేక, విధి లేక అమ్మాయిల చదువులకు కళ్లెం వేస్తున్నారు. అయినా బాగా చదివి మంచి ఉద్యోగం చేసినా కూతురి సంపాదన తమ కష్టాలను ఆదుకోదని వారికి తెలుసు. అంచేత కొడుకును చదువులో ప్రోత్సహించి, కూతురిని నిరుత్సాహపరచడంలో తల్లిదండ్రులు తప్పు చేస్తున్నట్లు భావించరు. ఈ విషయంలో వాళ్లను తప్పు పట్టి లాభం లేదు. ఇది మన సమాజ వాతావరణం. అదే నా ఆశలకూ, ఆశయాలకూ అడ్డు తగిలింది.

"నేను బి.ఎస్సీ పాసయిన వెంటనే మా నాన్న నాకు సంబంధాలు చూడడం ప్రారంభించారు. నేను పై చదువులు చదవాలని నా మనస్సులో ఉన్నది మా నాన్నతో అంటే, చాలా మంది తల్లిదండ్రుల మాదిరి తన మనస్సులో ఉన్నది నేను నీకు చెప్పిన కారణాలతో, అంత విడమరిచి




ఆల్బోసాంగ్‌తో శక్తి, ఆరోగ్యం, మరియు ఉల్లాసం


పెరిగే పాప ఎక్కువసేపు ఆడడానికి
తగిన శక్తి కలిగి ఉంది ఆ శక్తి రహస్యం?

ఆల్బోసాంగ్‌తో ఆరోగ్యం చేకూరుతుంది
అన్ని వయస్సులకు సరిపడే పౌష్టికాహారం ఉన్న టానిక్.
ఇందులోని ఖనిజాలు మరియు మూలికలు ఆహారానికి
అనుబంధంగా ఉపయోగపడతాయి.




ఇప్పుడు డబ్బాలలో
**200 గ్రా &**
**400 గ్రా**
ప్యాకింగ్‌లలో
లభించుచున్నది.

జె & జె. డిషేన్
లేబరేటరీస్ ప్రైవేటు లిమిటెడ్,
**4-1-324,** రెసిడెన్సీ రోడ్,
హైదరాబాద్-**500 001,** ఇండియా




చెప్పకపోయినా తనను సమర్థించుకున్నారు. నేను నిస్సహాయంగా మనస్సులో ఉన్న కోర్కెలను అణగదొక్కి వివాహానికి ఒప్పుకున్నాను. సంసార యాత్రలో యాంత్రికంగా జీవితం గడుపుతున్నాను. అంటే....''

''నువ్వు నిస్సహాయంగా వివాహానికి ఒప్పుకున్నాను అనడంలో నీ చేతకానితనం బయటపడిందంటాను. నీకు పైకి రావాలనే పట్టుదల ఉన్నప్పుడు ధైర్యంగా మీ నాన్న గారితో నీ ఉద్దేశ్యం చెప్పినట్లయితే ఆయన ఒప్పుకుని ఉందురేమో! 'మా నాన్నకు ఇష్టం లేనప్పుడు ఆ పని నే నెందుకు చేయాలి' అని నువ్వు సరిపెట్టుకుని నీ పట్టుదలకు సడలింపు కలుగజేశావు. అది నీ తప్పు!'' అంది మంజరి.

''నీకు తెలియదే! అందరూ మీ నాన్న లాటి వారేనని నీ అభిప్రాయం. మీ నాన్నకు డబ్బే కాదు, దానికి తగ్గ హోదా ఉంది. ఆ రెండు ఆయనకు తమ అమ్మాయికి కావలసినంత చదువు చెప్పించి, పెళ్లి చేయగలననే ధీమా నిచ్చాయి. మా నాన్నకు నాతోబాటు ఇంకో ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. ఆయన ఆగర్భ శ్రీమంతులు కారు. అంచేత ఆయన ఆలోచనలను నేను అర్థం చేసుకుని తదనుగుణంగా నడవడానికి నిర్ణయించాను. ఇది నా నిస్సహాయతే, నువ్వు ఏ విధంగా తీసుకున్నా.

''నేను యాంత్రికంగా సంసారం గడుపుతున్నాను అంటే, నా సంసార జీవితం కష్టాలతో నిండి ఉందనను. ఆ మాటకొస్తే మా వారు చాలా మంచి వారు. నన్ను పల్లెత్తు మాటనరు. అంతేకాదు. సంసారంలో నా మాటకు విలువనిస్తారు. తనకు వీలైనంతలో ఇంట్లో నాకు సాయం చేస్తారు. ఆ విధంగా నేను అదృష్టవంతురాలిననే చెప్పాలి. కాని నాకు పెద్ద చదువు చదవలేకపోయాననే నిరాశ మిగిలిపోయింది. అది ఒక పెద్ద లోటు కింద కాకపోయినా, నేను ఈ విషయంలో బాధపడుతూనే ఉంటాను. పెళ్లయిన కొత్తలో ఈ బాధ మరీ ఎక్కువగా ఉండేది. క్రమేణా సంసారం పెరుగుతున్న కొద్దీ అది కొంచెం దూరం అవుతూ ఉంది. 'ఈ స్థితిలో ఉన్నది నేనొక్కతెనే కాదు. నాలాటి వారు చాలా మంది ఉన్నారు' అనే భావన కూడా నాలోని నిరాశా వాదానికి స్వస్తి పలుకుతూ ఉంది. కాని ఒక్కటి చెప్పమంటావా? నిన్ను ఈ రోజు చూసిన తర్వాత నీ ముఖంలో కనిపించే సంతృప్తి వెలుగు చూడగానే నేను జీవితంలో ఏదో పోగొట్టుకున్నాననే భావం కలిగింది. ఇది నీ మీద కలిగిన అసూయ కాదు. నా పట్ల కలిగిన సెల్ఫ్ పిటీ'' అంది వనజ.

''నేను నిన్ను అర్థం చేసుకోగలనే వనజా! మనం చదువుకునే రోజుల్లో నీలో నాకు కనబడిన ఉత్సాహం, పట్టుదల - వీటికి తోడు నీ తెలివితేటలు నిన్ను ఒక ఉన్నత పదవిలో కూర్చోబెడతాయని నేను అనుకుంటూ ఉండేదాన్ని. నీ గురించి మా నాన్న గారితో అనేకసార్లు చెబుతూ ఉండేదాన్ని. కాని నువ్వన్నట్లు జీవితంలో మనం అనుకున్నవన్నీ జరగవు. పోతే, ఇప్పుడు నువ్వు జీవితంలో అమూల్యమైన దాన్నేదో పోగొట్టుకున్నానని బాధపడనక్కరలేదు. ఉద్యోగం చేస్తున్న స్త్రీ లందరూ సుఖ సంతోషాలలో ఓలలాడుతున్నారని నువ్వు అపోహపడనక్కరలేదు. కష్ట సుఖాలు ఏ జీవితంలోనైనా ఉంటాయి. డాక్టరుగా నేను చేస్తున్న పని నాకు పూర్తిగా సంతోషాన్నిస్తోందని అనుకోకు! నాకూ జీవితంలో ఏదో కోల్పోయానని మధ్య మధ్య అనిపిస్తూ ఉంటుంది. జీవితమే అంత. మనకు ఉన్న దానికంటే ఎదుటి వ్యక్తికి ఉన్నదాని మీదే ఆసక్తి, మెప్పు కలుగుతాయి. దానితో అది మనకు లేదే అనేది అసంతృప్తితో మనకు మన జీవితంలో ఏదో పెద్ద లోటు కనబడుతుంది. నా డాక్టరు జీవితంలో నీకు ఏదో గొప్ప కనబడితే, నీ సంసార జీవితం, నీ పిల్లలను చూస్తే నేను ఏదో కోల్పోయానని నాకు అనిపిస్తోంది'' అంది మంజరి.

''అవును, నువ్వు ఇంకా పెళ్లి ఎందుకు చేసుకోలేదు? మీ తల్లిదండ్రుల మాట నువ్వు వినడం లేదనుకుంటాను.''

''నా పెళ్లి విషయంలో మా వాళ్లకు కంగారుగానే ఉందే. వాళ్లిద్దరు పెద్దవాళ్లు అవుతున్నారు కదా? మా అన్నయ్య కూడా అమెరికా నుంచి ఆ విషయం రాస్తున్నాడు. అమెరికాలో మన ఇండియన్ డాక్టరు ఫ్రెండు ఉన్నాడని, నాకు ఇష్టమైతే అతనితో మాట్లాడుతానని, పెళ్లి అయిన తర్వాత అతను ఇండియాకు వచ్చి ప్రాక్టీసు పెట్టడానికి సిద్ధంగా ఉన్నాడనీను.''

''అయితే ఇంకనేమే, ఎందుకు ఒప్పుకోకూడదు? భార్యాభర్త లిద్దరూ కలిసి పనిచేస్తే మీ ప్రాక్టీసు మూడు పువ్వులు, ఆరు కాయలుగా అవదుటే!''

''నిజమే అవవచ్చు. కాని నాకు డాక్టరును చేసుకోవాలని లేదే. భార్యా భర్త లిద్దరు వేర్వేరు ఉద్యోగస్తులయితే వారికి ఒకరి నుండి ఒకరికి అనేక విషయాలు తెలుసుకునే అవకాశం ఉంటుంది. అదీ కాక వారి పిల్లల అభివృద్ధికి కూడా అవకాశం ఎక్కువ ఉంటుంది. అలా కాకుండా ఇద్దరిదీ ఒకే లైన్ అయితే వారిద్దరి 'ఇగో'ల సంఘర్షణ వల్ల సంసారంలో శాంతి కరువవుతుంది. సంసారంలోని సుఖ సంతోషాలకు డబ్బే ప్రధానం కాదు. భార్యా భర్తలు ఒకరినొకరు అర్థం చేసుకుని, తదనుగుణంగా తమ భావాలను మలచుకొనే శక్తి ప్రధానం. ఈ అవగాహన అహంభావాలతో పోటీపడకూడదు. అమెరికా అబ్బాయి అయితే ఈ ఇగోయిజమ్ కొంచెం ఎక్కువ పాళ్లలో ఉంటుంది. అటువంటి వారు ఏదో పెద్ద త్యాగం చేసి, ఎవరినో ఉద్ధరించడానికి ఇండియాకు వచ్చినట్లు ఫీలవుతూ, తమతోటి వారినందరిని తక్కువ భావంతో చూడడం అలవాటు చేసుకుంటారు. అట్టి వారిలో స్వార్థపరత్వానికే చోటు ఎక్కువ. నా అభిప్రాయం తప్పు కావచ్చు. కాదనను. కాని నాకు మాత్రం అమెరికా నుండి తిరిగి వచ్చిన అబ్బాయితో జీవితం పంచుకోవాలనే ఉద్దేశ్యం లేదు!'' అంది మంజరి.

''మా వారికి స్నేహితుడు స్టీలు ప్లాంటులో ఇంజనీరు. అతనికి ఇప్పటివరకు వివాహం కాలేదని మా వారు చెప్పారు. మా వారితో ఆయన మా ఇంటికి రెండు మూడుమార్లు వచ్చారు. చాలా అందంగా ఉంటారు. న న్నడిగితే నీకు సరైన జోడు!'' అంది వనజ.

''నిన్ను నాకు సంబంధాలు చూడమని చెప్పలేదు. అది సరేగాని మీ వారిని చూడడానికి మీ ఇంటికి రమ్మంటావా? లేక ఆయనను నర్సింగ్ హోమ్‌కు తీసుకు వస్తావా?'' అని అడిగింది మంజరి.

''నువ్వు మా ఇంటికి రావడమే మంచిది. నువ్వు ఎప్పుడు వచ్చేదీ చెప్తే మా వారి మిత్రుణ్ణి కూడా అప్పుడే వచ్చేలా ఏర్పాటు చేస్తాను. మీ ఇద్దరి పెళ్లి చూపులు కూడా అప్పుడే. మనం చదువుకునే రోజుల్లో నువ్వు మీ తల్లిదండ్రులకు చెప్పకుండా ఎక్కడ పెళ్లి చేసేసుకుంటావో అని భయపడుతూ ఉండేదాన్ని. కాని ఇప్పుడు నీకు మంచి సంబంధం చూసే భారాన్ని నా మీద వేసుకుని, నీ పెళ్లి నిశ్చయాన్ని మీ వాళ్లకు తెలపాలని కుతూహలంగా ఉంది'' అంది వనజ.

''నువ్వు పెళ్లిళ్ల పేరయ్య - అదే పేరమ్మవు అయ్యేవని తెలిస్తే నీతో ఇంతసేపు మాట్లాడి ఉండేదాన్ని కాదు. పెళ్లి మాట సరేగాని, మీ ఇంటికి ఈ వచ్చే ఆదివారం సాయంత్రం వస్తాను. మీ ఇంట్లో రాత్రి భోజనం చేసి కాని తిరిగిరాను. మరి ఏం పెడ్తావో చూస్తానుగా!'' అంది డాక్టరు మంజరి.

★